
డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్



ఆరు జిల్లాలకు లేని పూర్తిస్థాయి డీఈవోలు

అందరూ ఇన్‌చార్జ్‌లే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. అస్తవ్యస్త పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత కలిగిన విద్యాశాఖకే దిక్కులేని పరిస్థితి. చాలా ఏళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జిలతోనే కూనారిల్లుతున్న ఈ శాఖలో పరిపాలన కొరవడి, పర్యవేక్షణ కుంటుపడి పూర్తిగా గాడి తప్పింది. ఏం జరుగుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా కీలక పదవుల్లో ఒకరిద్దరు ఇన్‌చార్జిలు ఉంటారు. అదేమిటోగానీ.. విద్యా శాఖలో మాత్రం అంతాఇన్‌చార్జిలే రాజ్యమేలుతున్నారు. పైగా ఒక్కొక్కరికి రెండు మూడు బాధ్యతలు ఉన్నాయి. వీరంతా అసలు ఉద్యోగం వదిలేసి కొసరు కొలువుల్లో కొనసాగుతున్నారు. ఫలితంగా విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అంతకంతకూ పడిపోతోంది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చదువులు సట్టుబండలయ్యాయి. బళ్లు కడకండ్ల పాలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ దుస్థితిపై ప్రత్యేక కథనం..

- డిప్యూటీ డీఈవోలు అసలే లేరు
- రెగ్యులర్ ఎంఈవో ఒక్కరే..
- అన్ని మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు
- 70 శాతం స్కూళ్ల హెచ్‌ఎంలూ వారే
- ఉమ్మడి జిల్లాలో 2,500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న చదువులు.. గాడితప్పిన విద్యాశాఖ

హనుమకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలోనే కొనసాగుతోంది. డీఈవోలు, ఎంఈవోలు, ఆఖరికి హెచ్‌ఎంలు కూడా ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. డిప్యూటీ డీఈవోలు అసలే లేరు. డైట్ కాలేజీకి కూడా పూర్తికాలపు ప్రిన్సిపాల్ లేడు. బీఈడీ కాలేజీకి ప్రిన్సిపాల్ ఉన్నా ఆయనకు అదనపు బాధ్యతను అంటగట్టారు. దీనితో ఉన్నవారిపై అదనపు పనిభారం పడి పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీనితో ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చదువులు చెప్పే గురువులు లేక విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోగా సర్కార్ బళ్లు క్రమంగా మూతపడుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2500 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5.50లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 90 శాతం పాఠశాలలకు రెగ్యులర్ హెడ్ మాస్టర్లు లేరు. పాఠశాలల్లో పని చేసే సీనియర్ అధ్యాపకులకే హెడ్‌మాస్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. దీనితో వారు ఎప్పు డు వస్తారో ? ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని సర్కార్ బళ్లను ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2500లకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల నియామకానికి పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీఎస్సీని నిర్వహిం చలేదు. ఇటీవల డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినా అందులో ఉమ్మడి జిల్లాలో చూపిన టీచర్ పోస్టులు 560 మాత్రమే. టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రాల లీకేజీతో ఈ నియామక ప్రక్రియ కూడా అటకెక్కింది. గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్న తులు లేవు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గుతుండడానికి, సర్కార్ బళ్లు మూతబడానికి ఇది కారణమౌతోంది.

ఇన్‌చార్జ్ డీఈవోలు

- హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో)లు చాలా కాలం నుంచి లేరు.
- హనుమకొండ జిల్లాకు ప్రస్తుతం డీఈవో ఉన్న అబ్దుల్‌హై ఇన్‌చార్జే. వాస్తవంగా ఆయన బీఈడీ కాలేజీలో లెక్చరర్. ఆ కాలేజీకి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దీనితో పాటు ఆయనకు డీఈవో బాధ్యతలను కూడా అప్పగించారు.
- వరంగల్ జిల్లాకు కూడా రెగ్యులర్ డీఈవో లేడు. ఇన్‌చార్జ్ డీఈవోతోనే నాలుగేళ్లుగా నెట్టుకువస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఒకే ఒక్క డిప్యూటీ డీఈవోగా ఉన్న వాసంతిని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా కొనసాగుతున్నారు.
- జనగామ డీఈవో రాము ఇన్‌చార్జే. ఆయన రెగ్యులర్ పోస్టు విద్యాశాఖ (హైదరాబాద్)లో అడిషనల్ డైరెక్టర్. రెండేళ్ల కిందట జనగామ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అంటగట్టారు. దీంతో ఆయన జోడుగుర్రాల స్వారీ చేస్తున్నారు. ఇక్కడ ఒక రోజు, అక్కడ ఒక రోజు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అదనపు డైరెక్టర్ అయిన రామారావుకు ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాదిగా ఆయన అక్కడా.. ఇక్కడా రెండు పడవలపై కాళ్లుపెట్టి ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు.
- ములుగు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే దిక్కయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న పాణికి ఇక్కడ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే కొనసాగుతున్నారు. అడిషనల్ డైరెక్టర్ అయిన రాంకుమార్ ఈ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

డిప్యూటీ డీవోలు లేరు..

డీఈవోలుసరే ఎలాగూ లేరు. కనీసం డిప్యూటీ డీఈవోలు అయిన ఉన్నారా.. అంటే ఒక్కరు కూడా లేరు. ఉన్న ఒక్క డిప్యూటీ డీఈవో వాసంతికి డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా లేకుండాపోయారు. ఇదివరకు వరంగల్, జనగామ, మహబూబాద్ డివిజన్లలకు ఒక్కొక్కరు చొప్పున డిప్యూటీ డీఈవోలు ఉండేవారు. వారంతా రిటైర్ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారెవరూ రాలేదు. ఆ పోస్టులన్నీ ఆలాగే ఖాళీగా ఉండిపోయాయి.

ఒకే ఒక్క ఎంఈవో

ఉమ్మడి జిల్లా పరిధిలో 75 మండలాలుండగా మండలానికో విద్యాశాఖాధికారి (ఎంఈవో) విధిగా ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఈవో

మిగతా 7వ పేజీలో..

ఓరుగల్లు పౌరుషాల గడ్డ

- నన్ను మొదటి నుంచి గుండెల్లో పెట్టుకున్నారు..
- భీమా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో గోపీచంద్


ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అభివాదం చేస్తున్న హీరో గోపీచంద్

హనుమకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు ప్రజలను తానెప్పుడూ మరిచిపోలేనని ప్రముఖ హీరో గోపీచంద్ అన్నారు. వర్షం సినిమా ఇక్కడ నిర్మాణమైనప్పుడు ఏర్పడిన పరిచయం.. ఇప్పుడు భీమా సిని మా ప్రీరిలీజ్ ఈవెంట్ ఫంక్షన్‌తో మరోసారి కలుసుకొనే అవకాశం కలిగిందని అన్నారు. ఆయన నటించిన భీమా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో సందడిగా సాగింది. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. ఓరుగల్లు పౌరుషానికి గడ్డ అని ప్రశంసించారు. వరంగల్ ప్రజలు చాలా ఏళ్లుగా తనను గుండెల్లో పెట్టుకొని తన ప్రతీ సినిమాను ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నాడు భద్రన్నగా నేడు భీమాగా మీ ముందుకు వచ్చానని అన్నారు. ఎంతో కష్టపడి తీసిన భీమా చిత్రాన్ని విజయవంతం చేస్తార్న విశ్వాసాన్ని ప్రకటించారు.

హీరోయిన్ మాళవికి శర్మ మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన వరంగల్ నగరానికి రావడం మరిచిపోలేని అనుభూతిని మిగిల్చిందన్నారు. దర్శకుడు హర్ష మాట్లాడుతూ.. చాలా ఏళ్ల తర్వాత పవర్ పోలీసు ఆఫీసర్‌గా గోపీచంద్ చేసిన నటన హైలెట్ అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ.. గోపీచంద్ ఒక గొప్ప నటుడని, పలు చిత్రాల్లో ఆయన నటించిన పాత్రలు ప్రేక్షకుల గుండెల్లో చిరకాలం నిలిచి ఉంటాయన్నారు. చమ్మక్ చంద్ర, రచ్చ రవి తదితర నటులు మాట్లాడారు. ప్రముఖ యాంకర్ సుమ ఈవెంట్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చిత్ర నిర్మాత రాధామోహన్, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్నూర్ చిత్ర బృందంలోని ఇతరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

భద్రకాళి గుడిలో పూజలు

హీరో గోపీచంద్ తొలుత వరంగల్‌లోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గోపీచంద్‌తో పాటు భీమా చిత్ర బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు గోపీచంద్‌కు ఆశీర్వచనం చేశారు. తీర్థ ప్రసాదాలను అందచేశారు.

ఐదుగురు ఏసీపీల బదిలీ

హనుమకొండ క్రైం, మార్చి 2: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఏసీపీలకు బదిలీ, పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 మందికి స్థానచలనం కాగా, కమిషనరేట్ పరిధిలో ఐదుగురు బదిలీఅయ్యారు. బదిలీ, పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
ఎస్. శ్రీనివాస్	స్టేషన్‌ఘన్‌పూర్	డీజీపీ అటాచ్
సి. సతీష్‌బాబు	మామునూరు	డీజీపీ అటాచ్
ఆర్. భీంశర్మ	సిరిసిల్ల	స్టేషన్ ఘన్‌పూర్
బి. తిరుపతి	ఇంటెలిజెన్స్	మామునూరు
బి. మల్లయ్య	సీసీఎస్ వరంగల్	డీజీపీ అటాచ్

హిమాన్సీకి దుద్దిళ్ల శ్రీపాద స్మారక అవార్డు


అవార్డు అందుకుంటున్న హిమాన్సీ

హనుమకొండ కల్చరల్, మార్చి 2: హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన ప్రఖ్యాత కూచిపూడి నృత్య జాతీయ కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సీకి శనివారం రాత్రి రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఘనసత్కారం జరిగింది. మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా హిమాన్సీకి ఈ అరుదైన పురస్కారం లభించింది.

నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో వైద్య కళాశాల నిర్వహణకు చర్యలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 2: నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో మెడికల్ కళాశాల నిర్వహణకు చర్యలు తీసుకోవా లని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారు లను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్మాణంలో ఉన్న 250 పడకల జిల్లా ఆస్పత్రి నర్సంపేట పనుల పురోగతిపై ఆస్పత్రిలో తాత్కాలికంగా మెడికల్ కళాశాల నిర్వహణకు మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మ్యాప్‌ను పరిశీలించి బ్లాక్ వైస్ ఆస్పత్రి మెడికల్ కళాశాల నిర్వహణపై తగు సూచనలు చేశారు. ఇంకా మిగిలి ఉన్న ఫర్నీచర్ పనులు వేగవంతంగా పూర్తి చేసి వైద్య కళా శాల తరగతులు, ఆస్పత్రి ఏప్రిల్ నెలలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూ చించారు. 250 పడకలతో నిర్మాణంలో ఉన్న నర్సంపేట జిల్లా ఆస్పత్రిలోని మూడు బ్లాక్‌లలో ఒక బ్లాక్ వైద్య కళాశాల కోసం రెండు బ్లాక్‌లలో నర్సంపేట ఏరియా ఆస్పత్రిని, ఆస్పత్రికి వినియోగించాలని అన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిషన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి

జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, రైల్వే, జాతీయ రహ దారి అధికారులతో శనివారం భూసేకరణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులు ఎన్‌హెచ్ 163వరంగల్ నుంచి ఖమ్మం కాజీపేట నుంచి విజయవాడ మధ్యన మూడో లైన్ నిర్మాణానికి భూ సేకరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ల్యాండ్ అక్విజేషన్ పెండింగ్ పనులు అన్ని త్వరితగతిన పూర్తికావాలని పురోగతిపై వారంలోగా సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట ఆర్‌డీవో కృష్ణవేణి, కుడా ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు సాల్మాన్, ఆంజనేయులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు


రంజిత్ (ఫైల్)

గూడూరు, మార్చి 2: జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గూడూరు మండలంలోని మర్రిమిట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేట గ్రామానికి చెందిన కొమ్ము రంజిత్(24) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. తన స్నేహితుడైన మైదం రాజు మహబూబాబాద్‌లో రెడీమెడ్ షాపు నిర్వహిస్తున్నాడు. రంజిత్ తన స్నేహితుడి స్వగ్రామమైన కొమ్ము లవంచకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మర్రిమిట్ట వద్ద జాతీయ రహదారిపై మహబూబాబాద్ వైపు నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొ మ్ము రంజిత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మైదం రాజుకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో నర్సంపేట ఆస్పత్రికి తరలిం చారు. రంజిత్‌కు తండ్రి యాకయ్య, తల్లి మంగమ్మ ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

కమలంలో వీడని ఉత్కంఠ



- తొలి జాబితాలో ఓరుగల్లుకు దక్కని చోటు
- పార్లమెంట్ ఆశావహుల్లో టెన్షన్
- పార్టీలో చేరే వారి కోసమే వేచిచూస్తోందని ప్రచారం

వరంగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వస్తుం దన్న వార్తల నేపథ్యంలో బీజేపీ శనివారం తన అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేసింది. అం దులో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరార చేయకపోవడంతో కమలం టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ పెరు గుతోంది. దేశవ్యాప్తంగా 195మంది మందితో జాబితాను ప్రకటించగా.. అందులో రాష్ట్రంలో 9స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టడంతో టికెట్ ఎవరికి అనే చర్చ జరుగుతుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే నేతల కోసమే పెండింగ్‌లో పెట్టారా? లేదంటే రాజకీయ, కుల సమీకరణల కోసం జాబితాలో చోటు దక్కలేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

తొలి విడతలో నిరాశే

తొలిజాబితాలో రాష్ట్రంలోని ముగ్గు రు సిట్టింగ్ ఎంపీలతో పాటు మరో ఆరుగురికి కొత్తగా అవకాశం కల్పించిన అధిష్టానం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే వరంగల్ ఎంపీ స్థానం నుంచి డజను మంది కి పైగా నేతలు టికెట్ రేసులో ఉన్నా రు. అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంఆర్ పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగను వరం గల్ నుంచి పోటీ చేయించా లని సూచించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల్లో పోటీకి మంద కృష్ణ సుము ఖంగా లేరని, మాజీ పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పోటీ చే యబోతున్నారని ప్రచారం జరిగింది. వీరితో పాటు కీలక మైన నేతలు పలువురు టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తొలి విడత లోనే వరంగల్ పార్లమెంట్‌పై అధిష్ఠానం తేలుస్తుందని భావించినా కాషాయ నేతలకు నిరాశే మిగిల్చింది. అలాగే మాను కోట అభ్యర్థిని కూడా బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. బీజేపీ రాష్ట్ర నాయకులు హుస్సేన్ నాయక్, యాప సీతయ్యల్లో ఒకరికి టికెట్ ఖాయంగా బీజేపీ శ్రేణులు భావించాయి.

రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎంపీ సీట్లే ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఆదివాసీలకు టికెట్ ఇస్తే, మహబూబాబాద్‌లో లంబాడా సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తారనే చర్చ జరిగింది. అయితే ఆదిలాబాద్ బీజేపీ సిట్టింగ్ స్థానమైన ప్పటికి తొలిజాబితాలో అభ్యర్థిని ప్రకటిం చలేదు. దీంతో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి తెలితేనే మహబూబాబాద్ సీటుపై ఎవరికి అనేది స్పష్టత వస్తుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

ప్యారాచూట్ నేతల కోసమేనా..?

తొలి జాబితాలో వరంగల్, మహబూ బాబాద్ ఎంపీ అభ్యర్థులను బీజేపీ ప్రకటించ కపోవడానికి మరో కారణం కూడా ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు, నాగర్‌కర్నూలు ఎంపీ రాములు కుమారుడు భరత్‌కు సీట్లు ఖరారయయ్యా యి. దీంతో వరంగల్ నుంచి పోటీ చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌ను వీడిన తరువాత బీజేపీలో టికెట్ ఇవ్వకపోతే ఏలా అనే ప్రశ్నలు ఆ మాజీ ఎమ్మెల్యే నుంచి బీజేపీ నేతలకు ఎదరయ్యాయి. దీంతో పార్టీలో చేరిన వారికి అధిష్ఠా నం టికెట్ ఇచ్చిందని.. జహీరాబాద్, నాగూర్ కర్నూలు ఉదాంతాన్ని చూపెడుతూ.. ఓ బీఆర్‌ఎస్ నేతను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది. అలాగే మానుకోట నుంచి కూడా ఓ మాజీ ఎంపీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే కూడా గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం ఉంది. వీరితో చర్చలు చివరి దశలో ఉండటంతో తొలి జాబితాలో అభ్యర్థిని ఖరారు చేయలేదని సమాచారం. మొత్తానికి ప్యారాచూట్ నేతల కోసం అధిష్ఠానం ఎదురుచూస్తుందనే ప్రచారంతో టికెట్ కోసం ఎన్నో ఆశలతో ఉన్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

యూబీఐ రిటేల్ - ఎక్స్‌పో ప్రారంభం


మాట్లాడుతున్న, పాలగుల సత్యం

వడ్డెపల్లి, మార్చి 2: హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి (కుడా) గ్రౌండ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటేల్ - ఎక్స్‌పోను యూబీఐ రీజినల్ హెడ్ పాలగుల సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ వడ్డీతో గృహ, వాహన, విద్యా రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 14పైగా కార్లకు సంబంధించిన కంపెనీలు, 30కి పైగా బిల్డర్లు, సోలార్‌కు సంబంధించిన సప్లయర్లు పాల్గొన్నారు. రుణాలు పొందిన వారికి పాలగుల సత్యం మంజూరు పత్రాలను అందజేశారు. యూబీఐ అధికారులు నాంపెల్లి శ్రీనివాస్, రంగయ్యనాయుడు, సర్వేష్‌నాగార్జు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్- 1 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీలోగా తమ దరఖాస్తులను హనుమకొండ లష్కర్ బజార్‌లోని స్టడీ సర్కిల్ నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి కార్యాలయంలో 6న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, మార్చి 2: ఈ నెల 6వ తేదీన హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే, వరంగల్ హనుమకొండ కంపెనీలో 40 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 25 యేళ్ల వయస్సుగల నిరుద్యోగ యువకులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.



జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ రామన్

సందడిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

10 రాష్ట్రాల నుంచి 200 క్రీడాకారులు హాజరు

ఈనెల 8 వరకు పండుగ వాతావరణంలో క్రీడలు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 2: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ మెన్ టెన్నిస్ టోర్నమెంట్ సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలో వరంగల్ అఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ రామన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహపూర్వక సంబంధాలు పెంపొందిస్తాయన్నారు. హనుమకొండ వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు.

వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి, క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ఎం.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఓపెన్ టూ ఆల్ మెన్ విభాగంలో నిర్వహించనున్న టెన్నిస్ పోటీల్లో 10 రాష్ట్రాల నుంచి 70 సింగిల్స్ జట్లు, 33 డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఈనెల 8 వరకు నాకౌట్ పద్ధతిన పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో గెలిచిన క్రీడాకారులకు రూ.లక్ష పారితోషికాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఏవీ ఎలమురుగు, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, వరంగల్ అఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కన్నారెడ్డితో పాటు కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. కళలకు సొంతమై!

● స్వర్ణోత్సవ సంబరాలకు భారతీయ నాటక కళా సమితి సిద్ధం ● నేటినుంచి 8 తేదీ వరకు ఉభయ రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 2: భారతీయ నాటక కళా సమితిలో స్వర్ణోత్సవ సందడి నెలకొంది. శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. నాటి కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళాసమితి నిలువగా, అర్ధ శతాబ్దంలోకి అడుగు పెట్టడం కళాసమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది. నిర్వాహకుల అంకిత భావం, కళల పట్ల వారికి ఉన్న ఆరాధనతో భారతీయ నాటక కళా సమితి కళాభిమానుల మనసులను దోచుకుంటోంది. ఒకే మాట, ఒకే బాటగా భారతీయ నాటక కళా సమితి 49 వసంతాలు పూర్తి చేసుకోనుంది. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది నాటక రంగానికి చేస్తున్న సేవలతో అందరి అభిమానాలు చూరగొంటోంది. 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో దివంగత ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లారి రంగయ్య, పోశాల సూర్యనారాయణ, దివంగత సిరివోలు వెంకట్రామరావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు.

అల్లూరి స్ఫూర్తితో..

1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు మారింది. ప్రారంభంలో అనేక ఒడిదుడుకులకు లోనైనా కమిటీ సభ్యులు లక్ష్యసాధనే ధ్యేయంగా భావించి అప్పట్లో నిర్దిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. ఈ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించాలనే దృఢ సంకల్పం వారిలో పెరిగింది. వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామ రాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శనతో సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేయాలనే ఆలోచన కలిగింది.

ఐదు రోజుల పాటు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే నాటక పోటీలు పట్టణంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 3న మొదటి ప్రదర్శన తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత, కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో రాజుగారి గోచి, 4న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైలే రాజు, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం, 5న సిరిసిరిమువ్వ కల్చరల్ అసోయేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హక్కు, మురళీ కళానిలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవ్వా అప్పచ్చి, 6న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మూల్యం, మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బంధం, 7న అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి ఆధ్వర్యంలో ఇంద్రప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ఆధ్వర్యంలో కౌసల్యా సుప్రజా రామా, 8న శివరాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరర్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.

కలగానే జాతీయస్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషిచేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడు, చెన్నై రాష్ట్రాలకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింప చేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయస్థాయిలో పోటీలు కలగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

కమిటీలో సమన్వయ లోపం

భారతీయ నాటిక కళా సమితి కమిటీ సభ్యుల మధ్య సమన్వయం లోపించింది. గత నెల రోజుల నుంచి కార్యక్రమాలపై సమావేశాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ దాతలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందించడంలో విఫలమయ్యారు. ఈ నెల 3వ తేది నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతుండగా, రాత్రి వరకు ఆహ్వాన పత్రికలు పంచుతునే ఉండడం పట్ల విమర్శలకు గురవుతున్నారు. ఆహ్వాన పత్రికలో పలువురి పేర్లను సైతం తప్పుగా ముద్రించడం పట్ల దాతలు అసహనానికి గురయ్యారు. ఇక ఈ సారి భారీగానే విరాళాలు వసూలు చేసినట్లు తెలుస్తోంది?. మూలధన ఏర్పాటులో భాగంగా దాదాపు రూ.25 లక్షల వరకు కొత్తగా విరాళాలు సేకరించగా, ఆహ్వాన పత్రిక అడ్వటైజ్‌మెంట్ల ద్వారా రూ.3లక్షల వరకు సేకరించారు. గతేడాది కమిటీ సభ్యుల మధ్య విరాళాల సేకరణ, ఖర్చుల పద్దుల్లో కొంత పంచాయతీ ఏర్పడగా అంతర్గతంగా పరిష్కరించుకున్నారు. గతేడాది కార్యక్రమాల్లో స్టేజీ మీదకు పిలిచే సందర్భంలోనూ అతిథులు కమిటీ సభ్యులకు చివాట్లు పెట్టారు. మళ్లీ ఇవన్నీ పునరావృతం కాకుండా సభ్యులు చూసుకుంటూ సమన్వయంగా పని చేయాలని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.



వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సాగుతున్న పనులు

పార్కింగ్‌కు అడ్డాగా కళా సమితి ప్రాంగణం

గతంలో శివరాత్రి సందర్భంగా నాటికల కోసం ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులతో సైతం భారీగా షెడ్డు వేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫంక్షన్లు చేసుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్‌గా వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమాలు ముగియగానే ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోవడంతో కళా ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది. దీనికి తోడు పక్కనే సినియా థియేటర్ ఉండడంతో ఎంచక్కా ఆ యాజమాన్యం సినిమాలకు వచ్చే ప్రేక్షకుల వాహనాలు ప్రాంగణంలో ఉంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. ఇవన్నీ స్థానికంగా ఉన్న కమిటీ సభ్యులకు తెలిసినప్పటికీ వాటిపై దృష్టి సారించడంలేదు. నాటిక పోటీలు జరిగినప్పుడు ఊకదంపుడు ఉపన్యాస్యాలు ఇస్తున్న కమిటీ సభ్యులు కళలను ఆదరిస్తున్న ప్రజలకు పరోక్షంగా కళా ప్రాంగణం సహాయ పడే విధంగా చేయాలని కోరుతున్నారు.

నాటి కళలను కాపాడుకుంటాం : పెద్దూరి సంజీవరావు, కల్చరర్ సెక్రటరీ

నాటి కళలను కాపాడుకోవాలనే లక్ష్యంతో భారతీయ నాటకాలను క్రమం తప్పకుండా చేస్తున్నాం. దివంగత ఈగ శ్రీహరి ఆశయాలను కొనసాగించడంతో పాటు కళాసమితిని స్థాపించిన ప్రతీ ఒక్కరి నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నాం. కమిటీ సహాయ సహకారాలు, ప్రజల పూర్తి సహకారం, ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో మరింత విజయవంతంగా నాటిక ప్రదర్శనలు పూర్తి చేస్తాం.

అందరూ ఇన్‌చార్జ్‌లే..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న రవీందర్. మిగతా మండలాల్లో సుదీర్ఘంగా సీనియర్ హెడ్‌మాస్టర్లే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. సీనియర్ హెడ్‌మాస్టర్లకే ఈ బాధ్యతలు అప్పగించారు. వారు తమ రెగ్యులర్ హెచ్‌ఎం బాధ్యతలు చూసుకుంటూనే ఇటు ఎంఈవో విధులను కూడా నిర్వహించడానికి సతమతమవుతున్నారు. ఈ క్రమంలో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో ప్రతీ మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. అనేక మంది రిటైర్ కావడం, కొందరు మృతి చెందడం, ఎంఈవోలుగా పదోన్నతులు లేకపోవడం, కొత్త నియామకాలు చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల అసలు ఎంఈవోలే లేకుండా పోయారు. మండల పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎంఈవోలదే కీలక భూమిక. పూర్తికాలపు ఎంఈవోలే లేకపోవడంతో సర్కార్ బళ్ల తీరు రాజు లేని రాజ్యం అయింది.

హెడ్‌మాస్టర్లు

ఏ పాఠశాల అయినా సక్రమంగా నడవాలన్నా, విద్యార్థుల చదువులు సక్కగా సాగాలన్నా, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నా హెడ్‌మాస్టర్లే కీలకం. ఉపాధ్యాయులను నియంత్రణలో పెట్టి విద్యాబోధన సరిగా జరిగేట్టు చూసే బాధ్యత హెచ్‌ఎంలది. అటువంటి వారే ఇన్‌చార్జిలుగా ఉంటే ఇక బడులు నడిచేదెలా? సదువులు సాగెదెలా? అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రిన్సిపాళ్లూ ఇన్‌చార్జిలే..

ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే బీఈడీ, డైట్ కళాశాలలకు సైతం పూర్తి కాలపు ప్రిన్సిపాళ్లు లేరు. హనుమకొండలోని డైట్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నారాయణరెడ్డి ఉన్నారు. ఆయనకు యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. రెండు బాధ్యతలను ఆయన చూసుకోలేక సతమతమవుతున్నారు. ఇక్కడ కొద్ది రోజులు, అక్కడ కొద్ది రోజులు విధులు నిర్వహిస్తూ ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరు. ఇదే కాలేజీలో లెక్చరర్ అయిన అబ్దుల్‌హై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. అంతటితో సరిపోదన్నట్టు హనుమండ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలను అప్పగించారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇన్‌చార్జి డీఈవోలు, ఎంఈవోల కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయ పాలన పాటించకపోవడం, తర్వాత పాఠశాలలకు వచ్చాక సంతకాలు పెట్టడం, విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత పనులపై బయట తిరగడం, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు వంటివి చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించొద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు పనిభారం పేరుతో పలువురు ఉపాధ్యాయులను ఆఫీసు పనుల కోసం కార్యాలయాలకు రప్పించుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే అలుసుగా మరికొందరు ఉపాధ్యాయులు ఆఫీసు పని పేరు చెప్పుకొని సొంత పనులు చేసుకుంటున్నారని సమాచారం. దీంతో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. డీఈవోలు, ఎంఈవోలు అంతా ఇన్‌చార్జిలు కావడంతో విధుల నిర్వహణలో జవాబుదారీతనం కొరవడుతోంది. ఒకటికన్నా మించి అదనపు బాధ్యతలను అప్పగించడంవల్ల వారు దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి.

మూడోరోజు మేడారం హుండీల లెక్కింపు

ఆదాయం రూ 3.46 కోట్లు



హనుమకొండ, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టిటిడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు కొనసాగుతోంది. శనివారం మూడోరోజు 112 హుండీలను లెక్కించగా రూ 3,46,61,000 ఆదాయం సమకూరినట్టు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో మూడు రోజులుగా నిర్వహించిన హుండీ లెక్కింపుతో మొత్తం రూ.9,60,36,000 సమకూరింది. మొత్తం 317 హుండీలను లెక్కిం చడం పూర్తయింది. మొదటి రోజు రూ.3,15,40,000, రెండోరోజు రూ. 2,98,35,000 కోట్లు ఆదాయం సమకూరింది. ఇంకా 201 హుండీలను లెక్కిం చాల్సి ఉంది. వచ్చే రెండు రోజుల్లో వీటిని లెక్కించడం పూర్తి చేస్తారు. మేడారం జాతరలో మొత్తం 518 హుండీలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇనుప హుండీలు 482, క్లాత్ హుండీలు 34, బియ్యం హుండీలు. లెక్కించిన హుండీ ఆదాయాన్ని వెంట వెంటనే బ్యాంకులో జమ చేస్తున్నారు. హుండీల్లో ఇండియన్ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తంలో బయటపడుతోంది. దీనితో పాటు వెండి, బంగారు కానుకలు కూడా కంటపడుతున్నాయి. నాణాలు, బియ్యం పెద్దమొత్తంలో పోగవుతున్నాయి. నాణాలను చివరి రోజున తూకం వేయడం ద్వారా లెక్కిస్తారు. బియాన్ని బస్తాల్లో నింపు నిలువ చేస్తున్నారు. లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం వల్ల హుండీల లెక్కింపు త్వరితగతిన సాగుతోంది.





గీసుగొండలో ఓటరు చైతన్య ర్యాలీ

గీసుగొండలో ఓటరు చైతన్య ర్యాలీ

గీసుగొండ, మార్చి 2:ఓటరు నమోదు చైతన్య ర్యాలీని నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం గీసుగొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వేణుప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండినవారందరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకేంద్రం అధికారి చింతల అన్వేష్, వాలంటీర్ గాలి భిక్షపతి, వెల్దండ సురేష్, మహిళా సంఘం వీవోఏలు భవాని, హేమలత తదితరులు పాల్గొన్నారు.

మండిపోనున్న ఎండలు

● గతంలో కంటే పెరగనున్న వడగాలులు, అధిక ఉష్ణోగ్రతలు ● వేసవిలో చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ఎంతో మేలు



కరీమాబాద్, మార్చి 2: వేసవి కాలం వచ్చేసింది. రోజురోజుకు నగరంలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలను చూస్తుంటే వేసవి కాలం ముందే వచ్చేసిందా అన్నట్లుగా ఉంది పరిస్థితి. మార్చి మాసం నుంచి ప్రారంభమై ఏప్రిల్, మే నెలల్లో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడు. కానీ ఈ సారి మాత్రం ఎవరూ ఊహించలేని విధంగా ఫిబ్రవరి చివరి వారం నుంచే భానుడు తన ప్రతాపం చూపడంతో రానున్న రోజుల్లో ఎండలు మండిపోనున్నాయి. కారణం ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున దాని ప్రభావంతో ఈ సారి వేసవి హాట్‌గా హాట్‌గా ఉండబోతుందనేది నిపుణుల హెచ్చరిక. ఈ కారణంగానే నగరంలో ఎండల సెగ మొదలైంది. దీంతో రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగనున్నాయి. మొత్తంగా ఈ సారి వేసవికాలం గతంలో ఎప్పుడూ లేనంతగా తన ప్రభావాన్ని చూపనుంది.

చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే మేలు...

ఈ వేసవిలో పెరగనున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎంతో మేలు కలుగుతుంది. ఆరోగ్యంగా ఉండటం కన్నా పెద్ద భాగ్యం లేదు. అందుకోసం వేసవిలో ఎక్కువగా కొబ్బరినీల్లు, పుచ్చకాయ, నిమ్మరసం, ఆహారంలో పండ్లు తీసుకోవడం చేస్తే ఆరోగ్యానికి చాలా ఉత్తమం. అదే విధంగా వేసవిలో ఎక్కువగా బయటకు వెళ్లకపోవడం మంచిది. ఒకవేళ వేళ్లాల్సి వస్తే రక్షణ చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా తలకు టోపి ధరించి, ఒక వాటర్ బాటిల్ ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవడం మేలు. అదే విధంగా కంటికి సన్‌గ్లాస్‌లు పెట్టుకోవడం ఎంతో అవసరం. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. భగభగ మండే భానుడి ప్రతాపాన్ని ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. వాతారణం ఎదైనా తమ తమ ఉద్యోగ వ్యాపారాలను కొనసాగించక తప్పని పరిస్థితి కనుక ప్రజలు తమ పనులు చేసుకోక తప్పడం లేదు. మరి మండిపోతున్న ఎండల్లో తిరిగేవారికి తలపై పడే సూర్యకిరణాల ప్రభావం అధిక స్థాయిలో ఉంటుంది. దీంతో వడదెబ్బకు గురై అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది. కొంతమందికి ఎండల కారణంగా మైగ్రేన్ తలనొప్పి వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఇలాంటి వాతావరణంలో తిరిగే వారికి ఒంట్లో శక్తిని కోల్పోయి తల వేడెక్కిపోయి సాయంత్రానికి నీరసం వచ్చేస్తుంది. ఈ సమస్య నుంచి బయట పడాటానికి ఒకటే మార్గం. అదేటంటే తలపై మండిపోయే ఎండ ప్రభావం పడకుండా రక్షణ కవచంగా హెల్మెట్ లేదా మంచి క్యాప్ వాడటమే. తలకు టోపి ధరించడం వలన, సూర్యకిరణాలు నేరుగా తలకు చేరకుండా ఉంటాయి. తద్వార తలకు కొంత ఉపశమనం కలుగుతుంది. ఇందులోను తెల్లని క్యాప్‌లు చాలా మంచిది. సూర్యకిరణాలు తెల్లరంగు క్యాప్‌కు తగిలి పరావర్తనం చెందుతాయి.

నగరంలో విరివిగా అమ్మకాలు..

ఒకప్పుడు నగరంలో ఏదో ఒక ప్రాంతంలోనే టోపీలు విక్రయించేవారు. కానీ ఇప్పుడునగరంలో ఎక్కడపడితే అక్కడ, నగర శివార్లలో సైతం టోపీలు, సన్‌గ్లాస్‌లు విక్రయిస్తున్నారు. ప్రధానంగా రకరకాల క్లాత్‌తో తయారయ్యే టోపీలు అందుబాటులో లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్న టోపీల కంటే బ్రాండెడ్ టోపీలు మన్నిక, రక్షణలోనూ, అందంలోనూ మెరుగ్గా ఉంటున్నాయి. ప్రత్యేకించి ఎండ నుంచి రక్షణ కావాలంటే మంచి కంపెనీలకు చెందిన వాటిని వాడడం శ్రేయస్కరం. ఈ క్యాప్ లోపలి భాగంలో ప్రత్యేకమైన నెటెడ్ క్లాత్ ఉంటుంది. అది తలకు చెమట పట్టకుండా నీటిని పీల్చుకునే గుణం కలిగి ఉంటుంది. నేటి అవసరాలను బట్టి అనేక ప్రముఖ కంపెనీలు క్యాప్‌లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. నైక్, ఆడిడాస్, అండర్ ఆర్మర్, అజియోస్, రాయ్‌సెల్ఫ్, డీస్నీ, లెవిస్ ఇలా పలు రకాల కంపెనీల క్యాప్స్ ప్రముఖ కస్టమ్స్ షాపులు, షాపింగ్ మాల్స్, మెన్స్‌వేర్, ఆక్సిసరీస్ షాపుల్లోనూ, ఆన్‌లైన్‌లోను లభిస్తున్నాయి. సాధారణ క్లాత్‌తో కుట్టిన టోపీల రేట్లు సండే మార్కెట్, ఫుట్‌పాత్ సెంటర్లలో రూ. 100 నుంచి 150 వరకు ఉండగా, బ్రాండెడ్ టోపీల ధరలు రూ. 250 నుంచి రూ.600 వరకు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. తయారీ ఏదైనా వేసవి ఎండనుంచి తప్పించుకునేందుకు టోపీలు చక్కడా ఉపయోగపడుతున్నాయి. ఏది ఏమైనా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉపశమనానికి ప్రజలు టోపీలను కొనుగోలు చేసి వాడటం ఉత్తమం.

నేత్ర రక్షణకు సన్‌గ్లాస్‌లు

వేసవి వచ్చి ఎండలు మండుతున్నాయంటే ప్రతీఒక్కరికి గుర్తుకు వచ్చేది సన్‌గ్లాస్. వేసవిలో బైక్‌లపై బయటికి వెళ్లాలంటే చాలు భానుడి భగభగలతో వేడి గాలులతో కళ్ళు బైర్లు కమ్మడం ఖాయం. ఇలాంటి పరిస్థితులల్లో బైక్‌పై ప్రయాణం కొనసాడం చాలా కష్టమే అవుతుంది. ద్విచక్రవాహనాలపై తిరిగే వారు తప్పనిసరిగా ఈ చలువ కళ్ళజోళ్ళు వాడాల్సిందే. సన్‌గ్లాస్‌లను ధరించడం ద్వారా సూర్యరశ్మి నుంచి, వేడిగాలులు, దుమ్ము, ధూళి నుంచి కళ్ళకు రక్షణ లభిస్తుంది. నేటి యువతరం యువత ఇటు వేసవికి, అటు స్టైల్‌కి ఉపయోగపడే విధంగా మంచి లుక్ ఉండే సన్‌గ్లాసెస్ వాడుతున్నారు. వీటిలో కూడా ఏవియేటర్స్, గాగుల్స్, రాక్‌రోల్, రేబాన్, అంటూ రకరకాల మోడల్స్ ఉంటున్నాయి. సాధారణ కంపెనీలే కాక స్టాండర్డ్ కంపెనీలు కూడా బ్రాండెడ్ సన్‌గ్లాస్‌లను తయారు చేసి నగరంలోని మాల్స్, మెన్స్‌వేర్, మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మీడియం రేంజ్‌లో ఫ్లాయిడ్, రోడ్‌స్టర్, క్లార్క్ అండ్ పాయర్ రకాలు, హై ఎండ్‌లో వాయేజ్, రేబాన్, ఓక్లే, ఫెండి, గుచ్చి బ్రాండ్లు ఎక్కువగా వాడుకలో ఉంటున్నాయి. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన కళ్ళ జోళ్ళ ధర మార్కెట్లో రూ.1500 నుంచి రూ.3వేల వరకు ఆపై ధరల్లో ఉంటున్నాయి. సాధారణ కళ్ళజోళ్ళ రూ.150 నుంచి రూ. 800 ధరల్లో లభిస్తున్నాయి. ఈ సన్‌గ్లాస్‌లు నగరంలోని మార్కెట్ సెంటర్లలో అందుబాటులో ఉంటాయి.

సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకోవాలి

వరంగల్ సిటీ, మార్చి 2: జిల్లాలోని దివ్యాంగులు సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఆర్‌డీవో పీడీ కౌసల్యాదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని దివ్యాంగులకు ఈ నెల 5, 7, 12, 13, 14, 18, 19 తేదీల్లో ఎంజీఎం, కంటి ఆస్పత్రుల్లో సదరంక్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. నర్సంపేట డివిజన్‌కు చెందిన దివ్యాంగులకు 16, 19, 21 తేదీల్లో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో, వర్ధన్నపేట డివిజన్ దివ్యాంగులకు వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 26వ తేదీ నాడు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదరం క్యాంపులకు సంబంధించిన స్లాట్‌లు ఈ నెల 4 మధ్యాహ్నం 3 గంటల నుంచి అందుబాటులో ఉంటా యని, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

వరంగల్ సిటీ, మార్చి 2: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన పరీక్షకు 96.3 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జనరల్ విభాగంలో 5,166 మంది విద్యార్థులకు గాను 4,993 మంది హాజరు కాగా, వొకేషనల్ విభాగంలో 848కు గాను 797 మంది మొత్తం 5,790 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 173 మంది గైర్హాజరు కాగా, వొకేషనల్ విభాగంలో 51 మంది మొత్తంగా 224 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నగరంలోని వివిధ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీఐఈవో మాధవరావు సందర్శించి పరీక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

గీసుగొండ, మార్చి 2:మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన కంపెల్లి కనకమ్మ, పేర్ల మల్లయ్య నందనాయక్ తండాకు చెందిన బాదావత్ కమలమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. కాగా వారి కుటుంబాలకు జిల్లా కాంగ్రెస్ నాయకుడు, సామాజికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. అదేవిదంగా రాంపురం గ్రామంలో కాలువిరిగి అనారోగ్యంతో బాధపడుతున్న నాంపెల్లి రమేష్‌కు రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, నాయకులు అల్లం మర్రెడ్డి, చాడా కొమురారెడ్డి, కొమ్ము శ్రీకాంత్, సాయిలి ప్రభాకర్, కూసం రమేష్, మాదాసి రాంబాబు, నరసింహ, నరేష్, రాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన స్రవంతి



సంగెం, మార్చి 2: సంగెం మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన పెండ్లి స్రవంతి రెండు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించింది. గ్రామానికి చెందిన పెండ్లిరాములు-రమనీల దంపతుల కుమార్తె స్రవంతి తెలంగాణ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ రిక్రూమెంట్ బోర్డు శుక్రవారం రాత్రి ప్రకటించిన ఫలితాల్లో రెండు ఉద్యోగాలను సాధించింది. ఇంగ్లీష్, సోషల్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా ఉద్యోగాలు వచ్చాయి. దీంతో స్రవంతి కుటుంబ సభ్యుల్లో హర్షం వ్యక్తమవు తోంది. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ చిన్నప్పటినుంచి తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో చదవును కొనసాగించినట్లు చెప్పారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకున్నప్పటినుంచి భర్త పెంతల నవీన్ సహకారంతో విజం సాధించినట్లు చెప్పారు. తాను రెండు ఉద్యోగాలు ఒకే సారి వస్తాయని ఊహించలేదని అమె చెప్పారు.

భూ ఆక్రమణకు యత్నించిన వారిపై కేసు

వరంగల్ టౌన్, మార్చి 2: వరంగల్ నగరంలోని ఆరెపల్లిలో భూ ఆక్రమణకు యత్నించిన పలువురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ మండలం పైడిపెల్లి రెవెన్యూ గ్రామంలోని ఆరెపల్లి-కొత్తపేట మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 661లో గల భూమిలోకి కొంతమంది అక్రమంగా చొరబడి నెంబరు ప్లేటు లేని జేసీబీతో హద్దులు తొలగించి చదును చేసినట్లు తెలిపారు. ఇందేటని భూ యజమాని బుద్దె సురేష్ ప్రశ్నించడంతో తాము రూ.10 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నామని, తాము ఇచ్చిన డబ్బులకు డబుల్ చెల్లిస్తేనే వెళ్తామని బెదిరించినట్లు వెల్లడించారు. దీంతో బుద్దె సురేష్ ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నల్లబెల్లి మండలం, రెలకుంట గ్రామంకు చెందిన రాజునాయక్, ఆరెపల్లి గ్రామానికి చెందిన ఇజ్జగిరి రామకృష్ణ, ఇక్కనేని క్రాంతి, ముడిదె పూర్ణచందర్‌ల పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పుల బాధతో గీత కార్మికుడి ఆత్మహత్య



భిక్షపతి (ఫైల్)

నెక్కొండ, మార్చి 2 : మితిమీరిన అప్పుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన గీత కార్మికడు మందపురి భిక్షపతి (48) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థులు, ఎస్సై ఎం.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గీత కార్మిక వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న భిక్షపతి రెండు సంవత్సరాల క్రితం కూతురు లక్ష్మీప్రసన్న వివాహం చేశాడు. ఈ సమయంలో గ్రామస్తుల దగ్గర అప్పులు చేయగా, వ్యవసాయ సాగు కోసం అప్పులు చేశాడు. దాదాపు రూ.50 లక్షల వరకూ అప్పులు పెరగడంతో అప్పులు తీర్చడానికి ఎకరం 30 గుంటల భూమిని విక్రయించాడు. అయినా అప్పులు తీరక పోగా కేవలం 20 గుంటల భూమి మిగిలింది. తలకు మించిన అప్పులు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సునీత, కుమారులు అఖిల్, అరుణ్, తరుణ్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే ఇస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్‌టౌన్, మార్చి 2: వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని ఆమె వివరించారు. రా బోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపిం చుకు నేందుకు శక్తివం చనలేకుండా కృషి చేస్తానని సీఎంకు తెలిపారు.

లింగన్న సంస్మరణ సభ విజయవంతం చేయాలి

పోచమ్మమైదాన్, మార్చి 2: దిగవంత ఐఎఫ్‌టీయూ నేత కూరపాటి లింగన్న సంస్మరణ సభ విజయవంతం చేయాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో శనివారం లింగన్న మిత్రబృందం, ప్రింటింగ్, బైండింగ్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్మరణ సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిర్మాజీపేట చార్‌బౌళిలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం (నేడు) సాయంత్రం సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరవనున్నట్లు వెల్లడించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండా చంద్రమౌళి, కొంతం కృష్ణ, మాటేటి అశోక్, అకెన వెంకటేశ్వర్, పెరుమాండ్ల లక్ష్మణ్, గంజి సాంబయ్య, వెంగల సురేష్, అమృత భిక్షపతి, జంగం సదానందం, బొప్పరాతి రమేష్, నాగవెల్లి వెంకటస్వామి, వనం కిరణ్, రాజేందర్ పాల్గొన్నారు.

సర్వీసింగ్ సెంటర్ వద్ద ప్రమాదం



విద్యుత్తు తీగలకు తగిలిన లారీ

పోచమ్మమైదాన్, మార్చి 2: వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలోని ఓ సర్వీసింగ్ సెంటర్ వద్ద ప్రమాదవశాత్తు లారీ విద్యుత్ తీగలకు తాకడంతో షాక్ తగిలి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలోని యాకూబ్ సర్వీసింగ్ సెంటర్ వద్ద శనివారం ఓ లారీకి గ్రీస్ సర్వీస్ చేస్తున్న క్రమంలో డ్రైవర్ లారీ హైడ్రాలిక్ లిఫ్టింగ్ చేయగా ప్రమాదశాత్తు కరెంటు వైర్లకు తగలడంతో సర్వీసింగ్ చేస్తున్న ఇద్దరు వర్కర్లు విద్యుత్తు షాక్‌కు గురైయ్యారు. ఈ ఘటనలో షాపులో పనిచేసే కరీమాబాద్ ప్రాంతానికి చెందిన శేఖర్, బీహార్ రాష్ట్రానికి చెందిన ముక్తార్‌లకు తీవ్ర గాయాలైయ్యాయి. దీంతో స్థానికులు, షాపు నిర్వాహకులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా శేఖర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

జాతీయస్థాయిలో క్రీడాకారులు రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్

ఖిలావరంగల్, మార్చి 2:జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో మంచి మెళకువలు ప్రదర్శించి జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్ర పేరుప్రఖ్యాతలను తీసుకురావాలని అమేథ్యూర్ కిక్ బాక్సింగ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్, ప్రధానకార్యదర్శి ఇమ్మడి సంజయ్‌కుమార్‌లు అన్నారు. శనివారం 34వ, డివిజన్ శివనగర్‌లోని ఆయన నివాసంలో ఇటీవల జరిగిన ఆలిండియా జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వారు బోకేతో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లా హసన్‌పర్తి ఎస్‌ఆర్ యూనివర్సిటీ బీటెక్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు కల్లెపు సతీష్ కుమార్, చెల్పూరి రాహుల్ ఎంపికైయ్యారన్నారు. కిక్ బాక్సింగ్ క్రీడలో మంచి ప్రతిభను చూపి తెలంగాణ రాష్ట్ర పేరు, ప్రఖ్యాతలను తీసుకురావాలన్నారు. ప్రతిభ చూపినవారు ఈ నెల 5 నుంచి 9 వరకు స్వామివివేకానంద సూబర్తి యూనిర్సిటీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో జరుగు కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొననున్నారన్నారు.

కోటను సందర్శించిన దక్షిణాఫ్రికా దేశస్థులు



ఖిలావరంగల్ కోటలో దక్షిణాఫ్రికా దేశస్థులు

ఖిలావరంగల్, మార్చి 2: చారిత్రక ప్రాంతానికి చెందిన ఖిలావరంగల్‌కోటను మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి శిక్షణా కేంద్రం, హైదరాబాద్‌లో శిక్షణపొందుతున్న ఆఫ్రికా, దక్షిణాఫ్రికా దేశస్థులు, ప్రెస్‌మీడియాలో శిక్షణపొందుతున్న వారు శనివారం తిలకించారు. కాకతీయ రాజులు పరిపాలించిన కాలం నాటి ఖిలావరంగల్ మధ్య కోటలోని శిల్పాలను దక్షిణాఫ్రికా దేశస్థులు స్టడీ టూర్‌లో భాగంగా 29మంది తిలకించారు. వారికి తెలంగాణ పర్యాటక శాఖ అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ కాకతీయుల కాలం నాటి చరిత్ర, విశేషాలను వారికి వివరించారు. వారు ఖిలావరంగల్‌కోటలోని కీర్తి తోరణాలు, శిల్పాల ఆవరణతో పాటు గుండుచెరువు, ఖుష్‌మహల్, సింగారపు బావి, రాతి, మట్టికోట తదితర కట్టడాలను వారు ఆసక్తిగా తిలకించారు. తమ వెంట తెచ్చుకున్న కెమెరాలలో అద్భుతమైన కళాఖండాలు, శిల్పసంపదలు, కోట కట్టడాలను క్లిక్ మనిపించుకున్నారు. వీరి వెంట కేంద్ర పురావస్తుశాఖ ఖిలావరంగల్ సిబ్బంది, ఖిలావరంగల్ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో విద్యార్థుల ఆందోళన

వరంగల్ కలెక్టరేట్, మార్చి 2: ఇటీవల జిల్లా వైద్యఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్‌లో వివిధ కేటగిరీల్లో ఉద్యోగాల కోసం 32 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో డీఎంహెచ్‌వో కార్యాలయానికి తరలి వచ్చారు. శనివారం వందలాది మంది దరఖాస్తు చేసుకోవడానికి రాగా కేవలం ఒక్కరే దరఖాస్తు తీసుకుంటున్నారు. దీంతో రద్దీ కొనసాగగా ఆందోళనకు దిగారు. గొడవకు దారితీయడంతో అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకొని పరిస్థితిని సద్దుమనిగించి దరఖాస్తులు తీసుకునే విధంగా అధికారులు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏదో తూ తూ మంత్రంగా ఒక్కరిని పెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపించాయి.

స్పోర్ట్స్ మీట్‌తో ఒత్తిడిని అధిగమించవచ్చు



స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వడుప్సా కరస్పాండెంట్లు

వరంగల్‌టౌన్, మార్చి 2: స్పోర్ట్స్ మీట్‌తో ఒత్తిడిని అధిగమించవచ్చని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం ఓసిటీ మినీ స్టేడియంలో ఖిలావరంగల్ జోన్ ఆధ్వర్యంలో రామ శ్రీనివాస్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ 2024లో భాగంగా వడుప్సా కరస్పాండెంట్స్‌కు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, వస్కుల బాబు హాజరై తొలుత రామా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మా ట్లాడుతూ.. నిత్యం క్లాసు రూంల్లో పాఠాలు బోధించే కరస్పాండెంట్లు ఇలా స్పోర్ట్స్ మీట్ నిర్వహించుకోవడం అభినందనీయమని తెలిపారు. అదే విధంగా రామా శ్రీనివాస్ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన మహానుభావుడని కొనియాడారు. ఆటలో గెలుపు ఓటములు సహజమని దానిని స్పోర్టీవ్‌గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అధికారితో పాటు 70 మంది కరస్పాండెట్లు పాల్గొన్నారు.

స్పీకర్ పదవికి వన్నెతెచ్చిన శ్రీపాదరావు

కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కమాండెంట్, తదితరులు

సంగెం(మామునూరు), మార్చి 2: దివంగత నేత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్పీకర్ పదవికే వన్నెతెచ్చిన ప్రజా నాయకుడని మామునూరు 4వ పటాలం కమాండెంట్ డి. శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. శ్రీపాదరావు జయంతిని మామునూరు 4వ పటాలములో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సేవలను స్మరించుకున్నారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ శ్రీపాదరావు ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టనష్టాలలో పాలుపంచుకకుని మంచి నాయకుడిగా ఎదిగారన్నారు. మృదుస్వభావంతో వ్యవహరించి అందరి మన్ననలు పొందిన ఆయన జీవితం ఎందరికో ఆదర్శనియమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రన్న, రాజ్‌కుమార్, అశోక్, దయాశీల, అధికారులు మినిస్టీరియల్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

● వరంగల్ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల అనుసరించి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ సంధ్యారాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంథని ఎమ్మెల్యేగా, శాసన సభ స్పీకర్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధి కోసం కోల్ బెల్టు పారిశ్రామిక ప్రాంతంలో గణనీయమైన అభివృద్ధి చేశారని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, ఎలక్షన్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఉసురుతీసే ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

- ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గీసుగొండ, మార్చి 2: రైతుల ఉసురుతీసే పాలక ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం గంగదేవిపల్లిలో వంగల రాగసుధ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నియంతృత్వ పాలనకు అడ్డుకట్ట వేయాలన్నారు. లేకుంటే ప్రజాస్వామ్యానికి, వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్‌ఎఫ్‌తో కలిసి తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన చెప్పారు. వరంగల్, మహబూబాబాద్, వరంగల్, నల్లగొండ, చేవేళ్ల పార్లమెంటు స్థానాల్లో ఎంసీపీఐ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజాపోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, కేంద్రకమిటీ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, నాయకులు ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, తుకారాం నాయక్, నాగెల్లి కొమురయ్య, బాబురావు, నాగార్జున, సావిత్రి, రాజిరెడ్డి, కళావతి, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ నరేష్‌కుమార్ నియామకం



డాక్టర్ నరేష్‌ను అభినందిస్తున్న పలువురు వైద్యులు

కరీమాబాద్, మార్చి 2: నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నగరంలో ని ఫోర్ట్‌రోడ్‌లో గల సన్‌షైన్ హాస్పిటల్ నిర్వహకులు, ఎంఎస్, జనరల్ సర్జన్ డాక్టర్ వేము లపల్లి నరేష్ శనివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్‌ను నేషనల్ మెడికల్ అసోసియేషన్ బాధ్యులు, పలువురు వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సన్‌షైన్ హాస్పిటల్ ఏర్పాటు చేసి వైద్య రంగంలో అత్యున్నత సేవలు అందిస్తున్న డాక్టర్ నరేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని కోరారు. కాగా డాక్టర్ నరేష్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు. డాక్టర్ నరేష్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మైదం రాజు, డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ సంపత్, తదితరులు ఉన్నారు.

నేడే పల్స్ పోలియో..

వరంగల్ కలెక్టరేట్, మార్చి 2 : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆ రోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. వెంకటరమణ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్ర మంలో భాగంగా దేశాయిపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం జరిగే పల్స్ పోలియోలో జిల్లా కలె క్టర్ పి.ప్రావీణ్య పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు.

లైట్ అండ్ సౌండ్ షో వేళలు మార్పు

ఖిలావరంగల్, మార్చి 2: తెలంగాణ రాష్ట పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఖిలావరంగల్ మధ్య కోటలో ప్రదర్శించబడుతున్న కాకతీయుల కాలం నాటి చరిత్రను తెలిపే లైట్ అండ్ సౌండ్ షో సమయం (వేళలు) మార్చి 1 నుంచి, మార్పు చేసినట్లు సంబంధిత వరంగల్ జిల్లాశాఖాధికారులు తెలిపారు. వేసవికాలం దృష్ట్యా మార్చి 1 నుంచి మర్పామన్నారు. సాయంత్రం 7 నుంచి 7-50 గంటల వరకు మొదటి షో, (తెలుగు భాషలో), రెండో షో, రాత్రి 8 గంటల నుంచి 8.50 గంటల వరకు (ఇంగ్లీషు, హిందీ) భాషలో ప్రదర్శిస్తానన్నారు. పర్యాటకులు ఈ సమయాన్ని అనుసరించాలని తెలిపారు.

విద్యతోనే సమాజంలో గౌరవం



గుడిబడిలో ఏర్పాటు చేసిన ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అశోక్

వరంగల్‌టౌన్, మార్చి 2: క్రమశిక్షణ, ముందు చూపు, క్రియేటివిటీ, విద్యతోనే సమాజంలో మంచి గురింపు, గౌరవం పొందవచ్చని సైకలాజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం కాశిబుగ్గ నరేంద్రనగర్ గుడిబడిలో పాఠశాల ఇంచార్జి శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన, ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ, అలాగే భారతీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు పరీక్ష ల్లో ఎలాంటి భయం లేకుండా ఉండేందుకు ప్రేరణ కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పరికిపండ్ల అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ-ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ గత పదేళ్లుగా పదోతరగతి విద్యార్థులకు కోసం ప్రేర ణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ప్రేరణ కార్యక్రమాల్లో విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, చదువు కునే పద్ధతులు, జ్ఞాపకశక్తి మెలకువలు తదితర అంశాలపై సైకాలజిస్టులు వివరిస్తారని తెలిపారు. తాత్కాలికమైన అంశాల కోసం శాశ్వతమైన జీవితానికి చరమాకం పాడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, పాఠశాల ఉపాధ్యాయులు అజయ్‌బాబు, యాకూబ్‌పాషా, సంపత్, శ్రీవాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
WARANGAL RURAL
ఆదివారం 3 మార్చి 2024
వరంగల్ రూరల్
• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు మానుకోవాలి

వర్ధన్నపేట, మార్చి 2 : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా జిల్లా అధ్యక్షులు వ్యవహరించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బీరు రాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బర్ల బాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బర్ల సతీష్ మాట్లాడారు. పార్టీ గెలుపుకోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలను, సీనియర్ నాయకులకు ఎలాంటి సమాచారం, సంప్రదింపులు లేకుండా జిల్లా అధ్యక్షులు ఇతర పార్టీల వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సరికాదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలపై, నాయకులపై నిందలు వేసి ప్యాకేజీల కోసం పార్టీలు మారిన నాయకులను మళ్లీ కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకుంటారని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల అభీష్టం మేరకు మాత్రమే ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కా రోడ్లు ఉన్నా.. బస్సు సౌకర్యం కరువు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- ఉచిత బస్సు సౌకర్యం పొందని మహిళలు



నెక్కొండ-బొల్లికొండ ప్రధాన రహదారి

నెక్కొండ, మార్చి 2 : నేటి ఆదునిక ప్రపంచంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధిలో పోటి పడుతుండగా మండలంలోని పలు గ్రామాలు నేటికీ బస్సు సౌకర్యానికి నోచుకోవడం లేదు. దీంతో ఈ గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక రవాణ విషయంలో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యానికి పలు గ్రామాల మహిళలు దూరమయ్యారు. మండలంలో 39 గ్రామ పంచాయతీలు ఉండగా, 19 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.

రోడ్ల సౌకర్యం ఉన్నా..

మండలంలోని గొట్లకొండ, పత్తిపాక, బొల్లికొండ, సీతారాంపురం, చిన్నకొర్పోలు, రెడ్లవాడ, హరిచంద్రుతండా, నెక్కొండ తండా గ్రామాలకు పక్కా రోడ్డు సౌకర్యం ఉండగా బస్సు సౌకర్యం లేని కారణంగా ప్రమాదమని తెలిసినా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రైవేట్ వాహనాలలో ప్రయాణం సురక్షితం కానప్పటికి ప్రయాణించక తప్పడం లేదు. అలాగే అధిక రవాణా చార్జిల కారణంగా ప్రయాణాకుల జేబులు సైతం గుల్లవుతున్నాయి.

నేటికి రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు

మండలంలోని దాదాపు 11 గ్రామాలకు పక్కా రోడ్డు సౌకర్యం లేదు. నూతనంగా ఏర్పడిన కస్నాతండా, మహబూబ్‌నాయక్, నక్కలగుట్ట, అజ్మీరా మంగ్యా, వెంకట్‌తండా, రెడ్యానాయక్, చెరువుముందుతండా, దేవునితండా, మూడుతండా గ్రామాలకు నేటికి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. దీంతో ఈ గ్రామాలకు ప్రైవేట్ వాహనాలు సైతం రావడానికి ఇష్టపడటం లేదు.

విద్యార్థులు, మహిళలకు అందని ఆర్టీసీ ఉచిత సేవలు

ఆర్టీసీ సంస్థ నుంచి ప్రభుత్వం అందించే ఉచిత బస్‌పాస్‌లను ఈ గ్రామాల ప్రజలు వినియోగించుకోలేక పోతున్నారు. నిత్యం వరంగల్, నెక్కొండ తదితర పట్టణాల్లోని విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించడానికి ఈ గ్రామాల నుంచి వెళుతున్న విద్యార్థులు ఆర్థిక భారమైనప్పటికీ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. సాయంత్రం సమయంలో ప్రైవేట్ వాహనాలు అందుబాటులో లేకుంటే కాలినడకే శరణ్యమవుతుంది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కూడా వినియోగించుకోలేక పోతున్నారు. ఉచిత బస్సు సౌకర్యం కోసం కిలోమిటర్లు నడవాల్సి రావడంతో మహిళలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.



నెక్కొండ-పత్తిపాక గ్రామ ప్రధాన రహదారి

బస్సు సౌకర్యం కల్పించాలి
బండారు మురళీకృష్ణ, విద్యావేత్త



తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు తీస్తుండగా, నెక్కొండ మండలంలో మాత్రం పల్లెకు బస్సు, పక్కా రోడ్ల సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పాలకులు ప్రత్యేక దృష్టి సారించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించాలి.

పాలకులకు పట్టింపులేదు
చాగంటి వెంకటయ్య, కార్మిక నాయకుడు



పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పదే పదే చెపుతున్న పాలకులు, నెక్కొండ మండలంలో నేటికి పలు గ్రామాలకు కనీసం బస్సు సౌకర్యాన్ని కూడా కల్పించలేదు. పాలకులు చేపడుతున్న అభివృద్ధిని మండలంలోని పల్లెలు వెక్కిరిస్తున్నాయి. మౌలిక సదుపాలయాల కల్పనలోనే విఫలమైన నాయకులు ఇక పల్లెలను ఎలా అభివృద్ధి చేస్తారనే మాటలను ప్రజలు ఎలా నమ్ముతారు.

ఉచిత బస్సు సౌకర్యం ఎరగం..
బొల్లబోయిన రాజమ్మ, మాజీ సర్పంచ్, పత్తిపాక



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని తమ గ్రామస్థులు ఎరగరు. పక్కా రోడ్డు ఉన్న ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామన్న ఆర్టీసీ అధికారులు నెక్కొండ నుంచి తమ గ్రామానికి పక్కా రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు పంపించడం లేదు. తాను సర్పంచ్‌గా ఉన్న కాలంలో బస్సు సౌకర్యం కోసం ప్రయత్నించినప్పటికీ ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

పరీక్షల సమయంలో ఇబ్బంది
మంచినీళ్ల రణధీర్, విద్యార్థి



పరీక్షల సమయంలో గ్రామాల నుంచి ప్రైవేట్ వాహనాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పరీక్ష హాల్‌లోకి నిమిషం ఆలస్యం అయినా అనుమతి ఇవ్వరు. కొన్ని సందర్భాల్లో వహనాలులేని కారణంగా సమయం మించిపోతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

వందశాతం పన్నులు చెల్లించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

వర్ధన్నపేట, మార్చి 2: వర్ధన్నపేట పురపాలిక పరిధిలో వందశాతం పన్నులు చెల్లించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శనివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో 2024-25 అంచనా బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ముఖ్య అతిథిగా మాట్లాడారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. ఇందుకు గాను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మునిసిపల్ జూనియర్ అకౌంటెంట్ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ ఇ. జోనా, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, డీఈ శ్రీనాథ్, వార్డు, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ ఏఈ అనిల్, టౌన్ ప్లానింగ్ అధికారి, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ



రాయితీ వివరాలు వివరిస్తున్న కమిషనర్

చెన్నారావుపేట, మార్చి 2 : ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీని నర్సం పేట పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని నర్సంపేట మునిసి పల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిల్లోని ప్రధాన మొత్తాన్ని చెల్లిస్తే ఆస్తి పన్నుపపై పేరుకుపోయిన బకాయివడ్డీ 90 శాతం మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వన్ టైం సెటల్‌మెంట్ కింద ఈ స్కీంను మునిసిపాలిటికి వర్తింప జేసిందన్నారు. ఆస్తిపన్నులకు సంబంధించి 10శాతం వడ్డీతో ఆస్తిపన్ను చెల్లించిన వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కట్టబోయే ఆస్తిపన్నులో మినహాయింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆస్తిపనన్ను బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పార్టీ కోసం సమన్వయంతో పనిచేయాలి



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి, మార్చి 2 : నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాత కొత్త తేడాలేకుండా సమన్వయంతో పనిచే యాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ చేరిన మాజీ మార్కెట్ చైర్మన్ మచ్చ లక్ష్మినారాయణకు కండువా కప్పిఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి వచ్చిన వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడంతో పాటు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ముద్దరబోయిన వెంకన్న , రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ఎనగందుల మురళీ, మచ్చ నీలయ్య, నరేష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

వర్ధన్నపేట, మార్చి 2 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని పుస్కోస్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే స్నాతకోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫాదర్ అను కిరణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో ఎంతో నైపుణ్యం దాగి ఉందని, దీనిని వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో కళలపై అవగాహన కలిగేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు తమ ఆట పాటలతో ఆహూతులను ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మేరి ఆంటోని, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ డైసీ, అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ జెనీఫర్, సిస్టర్ షర్మీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన ప్రభుత్వ ధ్యేయం

రాయపర్తి, మార్చి 2: నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన ప్రభుత్వ ధ్యేయమని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్ గౌడ్ అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన సందర్భంగా శనివారం పర్వతగిరి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 75 రోజుల్లోనే 11,062 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసిందని, గత సర్కారు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా గొర్లు, బర్లు ఇచ్చి చేతులు దులుపుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీరటి ప్రశాంత్, నాయకులు నరేష్, దేవేందర్, లోకేష్, వినయ్, రాము, పృధ్వి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

రాయపర్తి, మార్చి 2 : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ లూనావత్ కమల అన్నారు. శనివారం పర్వతగిరి మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, కో ఆప్షన్ మెంబర్ సర్వర్, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వెంకటస్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

నర్సంపేట టౌన్, మార్చి 2 : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024 జనవరి నెలలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ (లైఫ్‌సైన్సెస్) బీఎస్సీ (ఫిజికల్ సైన్స్‌స్) మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శనివారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటానమస్ కళాశాలలో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయంమన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు బీఎస్సీలో 81 శాతం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్)లో 79 శాతం, బీఏలో 50 శాతం, బీకామ్‌లో 52 శాతం ఉత్తర్ణీత సాధించారన్నారు. విద్యార్థులు మరింతగా చదవాల న్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ శివనాగ శ్రీను, తోట రమేష్, డాక్టర్ విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

దుగ్గొండి, మార్చి 2 : మండలంలో 0 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలకు ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేసే విధంగా 35 కేంద్రాలు, 164 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు దుగ్గొండి, కేశవాపురం వైద్యాధికారులు కిరణ్‌రాజు, విజయ్‌కుమార్‌లు శనివారం వెల్లడించారు. దుగ్గొండి పీహెచ్‌సీ పరిధిలో 21 కేంద్రాలలో 21 కేంద్రాలు, 108 మంది సిబ్బంది, కేశవాపురం పీహెచ్‌సీ పరిధిలో 14 కేంద్రాలు, 56 మంది సిబ్బందిని నియామించినట్లు డాక్టర్లు తెలిపారు. ప్రతీ చిన్నారి పోలీయో చుక్క వేసుకునే విధంగా చూడాలని సిబ్బందిని కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

చెన్నారావుపేట, మార్చి 2 : మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. హెచ్‌ఎంగా కొంకటి, డీఈవో, ఎంఈవోగాగా సాదు మేధా వెన్నెల, బిల్లా సుష్మితా, మేడిద అశ్వితా, మంద అశ్విత, కుమారిలు ఉపాధ్యాయులుగా పీఈటీలుగా బొమ్మ కంటి వింటు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వరంగంటి వెంకటేశ్వర్లు, శ్యామ్, సుందర్‌యాదవ్, ఉమాశంకర్ గౌడ్, ఈక నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూజారిగా గుర్తించి గౌరవ వేతనం ఇవ్వాలి
దేవాదాయ శాఖ మంత్రి సురేఖకు రాములు స్వామి వినతి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న హనుమాన్ దేవాలయ పూజారి

దుగ్గొండి, మార్చి 2 : మండలంలోని ముద్దునూర్ హనుమాన్ దేవాలయంలో పూజారిగా పని చేస్తున్న గాదె పాక రాములు స్వామి శుక్రవారం వరంగల్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి పూజారిగా గుర్తించి, గౌరవ వేతనం ఇప్పించాలని వినతి పత్రం అందించారు. దళిత వర్గానికి చెందిన తాను గత 30 ఏళ్లుగా హనుమాన్ దేవాలయంలో పూజారిగా పని చేయడంతో పాటు అఖిల భారత హనుమాన్ ప్రచారకుడిగా సేవలు అందిస్తున్నానని, రాష్ట్రంలో 9 జిల్లాల్లోని శ్రీరామ మందిరాల్లో 534 హోమాలు నిర్వహించినట్లు వినతి పత్రంలో తెలిపారు. దళిత పూజారిని కావడంతోనే గుర్తింపు లేదని, ఎలాంటి అవార్డులు అందలేదని, పలుసార్లు మౌన దీక్షలు చేశానని, పూజారిగా ప్రభుత్వ పరంగా గుర్తింపు లభించే విధంగా చూడాలని రాములుస్వామి వినతి పత్రంలో దేవాదాయ శాఖ మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి న్యాయంచేయాలని దేవాదాయ శాఖను ఆదేశించినట్లు రాములు స్వామి వెల్లడించారు.

మా జీవితం ప్రజా సేవకే అంకితం
కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



వివాహ వేడుకలు జరుపుకుంటున్న ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 2 : తమ జీవితం ప్రజా సేవకే అంకితమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద లక్ష్మీ గార్డెన్‌లో కార్యకర్తల నడుమ 45వ వివాహ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వారు మాట్లాడుతూ ఎన్నోఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పదవులుఉన్నా లేకపోయిన ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ దాంపత్య జీవితంలో రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు చూశామని, అవన్నీ తట్టుకుని నిలబడి నేడు ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తమ బలం, బలగమని వారితోనే తమ జీవిత ప్రయాణం సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇంతే ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, భూక్యా సరిత, సీనియర్ నాయకులు మహ్మద్ అప్సర్, నల్లతీగల రవి, తాళ్లపెల్లి యాదగిరి, కమలాకర్‌రావు,బంగారు సదానందం, సమ్మయ్య, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

వర్ధన్నపేట, మార్చి 2 : శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు కౌన్సిలర్లు గైర్హాజరు

వర్ధన్నపేట, మార్చి 2 : వర్ధన్నపేట మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశానికి ఆరుగు కౌన్సిలర్లు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. వర్ధన్నపేట మునిసిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు ఉండగా మిగతా పది మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో ఆరుగురు కౌన్సిలర్లు వర్ధన్నపేట మునిలిసిపాటిలో శనివారం నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి హాజరు కాలేదు. మునిసిపాలిటీలో అవినీతి అక్రమాలపై ప్రశ్నించడం, అవిశ్వాసం తీర్మానం పెట్టిన విషయంలో సైతం ఈ ఆరుగురు కౌన్సిలర్లు ఉండటం విశేషం.

విధుల్లో చేరిన సొసైటీ కార్యదర్శి

రాయపర్తి, మార్చి 2 : పర్వతగిరి సొసైటీ కార్యదర్శి చింతకాయల సురేష్ శనివారం తిరిగి విధుల్లో చేరారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిని కొనుగోలు చేశారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏరియా అధికారి కీరునాయక్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపర్తి, మార్చి 2 : పర్వతగిరి మండల కేంద్రంతో పాటు రావూరు, చౌటపెల్లి ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆదివారం ఉదయం 9గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

గీత కార్మికుడి ఆత్మహత్య



భిక్షపతి (ఫైల్)

నెక్కొండ, మార్చి 2 : మితిమిరిన అప్పుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన గీత కార్మికడు మందపురి భిక్షపతి (48) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థులు, ఎస్సై ఎం.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గీత కార్మిక వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న భిక్షపతి రెండు సంవత్సరాల క్రితం కూతురు లక్ష్మిప్రసన్న వివాహం చేశాడు. ఈ సమయంలో గ్రామస్తుల దగ్గర అప్పులు చేయగా, వ్యవసాయ సాగు కోసం అప్పులు చేశాడు. దాదాపు రూ.50 లక్షల వరకూ అప్పులు పెరగడంతో అప్పులు తీర్చడానికి ఎకరం 30 గుంటల భూమిని విక్రయించాడు. అయినా అప్పులు తీరక పోగా కేవలం 20 గుంటల భూమి మిగిలింది. తలకు మించిన అప్పులు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో సీలింగ్ ప్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సునీత, కుమారులు అఖిల్, అరుణ్, తరుణ్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పౌష్టికాహారాన్ని భుజించాలి

రాయపర్తి, మార్చి 2 : గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని భుజించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని పెర్కవేడులో గర్భిణులకు బాలింతలకు లింగ వివక్షపై అవగాహన కల్పించారు.

ఎస్సైని కలిసిన నాయకులు

చెన్నారావుపేట, మార్చి 2: చెన్నారావుపేట మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గూడ అరుణ్‌ను ఎంసీపీఐయూ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంను అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేస్, నాంపెల్లి రాజు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

నర్సంపేట టౌన్, మార్చి 2 : మండలంలోని పలు గ్రామాలల్లోని రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖిధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉషాదయాల్ మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న పంటలో వాతావరణ పరిస్థితుల అనుగునంగా పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పాము పొడ తెగులు, కత్తెర పురుగు, కాండం తొలిచే పురుగులతో పాటు పలు రకాల కీటాకాలు ఆశించే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఎప్పటికప్పుటు పంటలను పరిశీలిస్తు, వ్యవసాయశాఖాధికారు సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకుడు శ్రీనువాస రావు, ఏడీఏ సారంగం, సీహెచ్ కృష్ణారెడ్డి కృష్ణాకుమార్, ఏవో అశోక్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

'తొలి దశ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి'

నెక్కొండ, మార్చి 2 : తెలంగాణ స్వరాష్ట్ర సాధనకోసం 1969లో జరిగిన తొలిదశ తెలంగాణ ఉద్యమ కారులను ప్రభుత్వం గుర్తించి ఆదరించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు మండలంలోని చంద్రగొండ గ్రామానికి చెందిన ఉద్యమకారులు వినతి పత్రాన్ని అందించారు. ఉద్యమ సమయంలో పలు కేసులపాలై జైలకు వెళ్లడమే కాకుండా ఆస్తులను, ఆరోగ్యాలను కొల్పోయామన్నారు. పోలీసు రికార్డులను ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ఈ రికార్డులను పరిశీలించి ఉద్యమకారులకు పింఛన్ సౌకర్యం కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డే లక్ష్మినారాయణ, బట్టు లక్ష్మయ్య, పున్నం మణేమ్మ, అనంతరెడ్డి, మధుసుదన్‌రెడ్డి, మురళీధర్, లక్ష్మి, సమ్మయ్య, సర్వేశం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టి చెందేలా శిక్షణ

దుగ్గొండి, మార్చి 2 : మహిళలు ఆర్థికంగా పరిపుష్టి చెందే విధంగా స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని డీఆర్‌డీవో గీతారాణీ అన్నారు. మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన వీవోఏలు, సీసీలు మండల పాలక వర్గ సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ స్వయం గ్రూపు సంఘాలలోని సభ్యులలో వారి నైపుణ్యాలను గుర్తించి, వ్యాపారం చేసుకునే విధంగా సీఐఎఫ్ నిధులు, స్త్రీనిధి, బ్యాంక్‌ల ద్వారా పెట్టుబడులు అందించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మహిళలు ఆర్థికంగా బలపడే విధంగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం లఖ్‌పతి దీదీ పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు పథకం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీఎంలు సుధాకర్, రాజ్‌కుమార్,సీసీఏలు పద్మ, శ్రీలత, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలను సాధించిన రమాదేవి



నెక్కొండ, మార్చి 2 : నెక్కొండ మండలం పనికర గ్రామానికి చెందిన మెండే రమాదేవి టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్‌గా మూడు ఉద్యోగాలు సాధించడమే కాకుండా, రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించడంతో శనివారం మండల ప్రజల అభినందించారు. రమాదేవి ఎంఎస్సీ బీఈడీ (మ్యాథ్స్) పూర్తిచేసి ఆర్థికంగా లేని కారణంగా ఎలాంటి కోచింగ్ సెంటర్‌లకు వెళ్లకుండా ఇంట్లోనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయింది. అల్లాడి సంపత్‌తో వివాహం జరుగగా, ఈ దంపతులకు పది సంవత్సరాల వయస్సు కలిగిన కూతరు తన్విశ్రీ ఉంది. అయినప్పటికీ పట్టుదలతో మూడు ఉద్యోగలకు ఎంపిక కావడంతో పాటు పీజీటీలో రాష్ట్ర వ్యాప్తంగా 97 వ ర్యాంక్, జనరల్ లెక్చరర్‌గా రాష్ట్ర వ్యాప్తంగా 152 ర్యాంక్ ను సాధించారు.

ఉద్యోగాలు సాధించిన రవిలాల్‌కు సన్మానం

చెన్నారావుపేట, మార్చి 2 : మండలంలోని కాల్ నాయక్ తండాకు చెందిన బాదావత్ రవిలాల్ ఒకే సారి మూడు ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ శనివారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జేఎల్, పీజీటీ, టీజీటీలో ఉద్యోగాలను సంపాధించగా, జీపీ కార్యాలయంలో కార్యదర్శి గొడిశాల వికాస్‌గౌడ్ ఘనంగా సన్మానించి మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవిలాల్ ఎంతో కష్టపడి చదివారన్నారు. గ్రామంలో ఉపాధిహామీ పనులకు సైతం వచ్చాడన్నారు. యువత ఆయన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన సాహితి స్ఫూర్తిదాయకం

నర్సంపేట టౌన్, మార్చి 2 : నర్సంపేట పట్టణంనకు చెందిన గుంటి సాహితీ ఏకకాలంగా నాలుగు ఉద్యోగాలు సాధించి, పలువురి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ అన్నారు. శనివారం సాహితిని లీడ్ లైబ్రరీలో సన్మానించి, మాట్లాడారు. సాహితి ఇటీవల ప్రకటించిన డీఎల్, జేఎల్, పిజీటీ, టీజీటీలో ఉద్యోగాలు సాధించటం ఎంతో అభినందనీయంమని,సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేసి ఉద్యోగాలు సంపాధించిందన్నారు. మరింతగా పెద్ద లక్ష్యాలను రాణించలన్నారు. ఈ కార్యక్రమంలో కాసుల శోభరాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే టెన్త్ ఎగ్జామ్ సెంటర్ కొనసాగించాలి

నల్లబెల్లి, మార్చి 2: నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ బడిలోనే యథావిధిగా 10వ తరగతి ఎగ్జామ్స్ సెంటర్‌ను కొనసాగించాలని ఏబీవీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ తెలిపారు. శనివారం మండల తహసీల్దార్ బొనగాని రాజేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. మండలంలో మూడు టెన్త్ ఎగ్జామ్స్ సెంటర్‌లు ఉన్నాయన్నారు. వీటిలో ఒక్కటైన మండల కేంద్రంలోని ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల సెంటర్‌లో సౌకర్యాలు బాగా లేవనే సాకుతో టెన్త్ ఎగ్జామ్ సెంటర్‌ను రద్దు చేసి, ఓ ప్రైవేట్ పాఠశాలకి టెన్త్ ఎగ్జామ్ సెంటర్‌ను కొత్తగా ఇవ్వడం సరైంది కాదన్నారు. దీంతో విద్యార్థులు నష్టపోతారన్నారు. మన ఊరు మన బడి ప్రణాళికతో ఈ ప్రభుత్వ బడి అన్ని రకాల సౌకర్యాలతో అద్భుతంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలకు ఇచ్చిన ఎగ్జామ్ సెంటర్‌ను రద్దు చేయాలన్నారు. లేనిఎడల విద్యార్థి సంఘాల సమక్షంలో నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్, వినయ్ పాల్గొన్నారు.

లఖ్‌పతి దీదీతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఖానాపురం, మార్చి 2 : మహిళలు లఖ్‌పతీ దీదీ యోజన పథకంతో ఆర్థికాభివృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ డీపీఎం సరిత, ఏపీఎం ప్రేమ్‌రాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో లఖ్‌పతీ దీదీ యోజన పథకంపై వీవోఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులను చేసే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో లఖ్‌పతీ దీదీ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంతో ప్రస్తుతం మహిళలకు ఉన్నా జీవనోపాధులను మెరుగు పరుచుకోవడం, కొత్త జీవనోపాధులను సృష్టించుకొని ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు ప్రణాళికలు రూపొందించి, వారి వివరాలను లఖ్‌పతీ దీదీ యాప్‌లో పొందుపరిచి వారికి ఆర్థిక చేయూతనివ్వడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. సంబంధిత వీవోఏలు అర్హులైన సంఘాలకు, అర్హులైన సభ్యులకు ప్రణాళికలు రూపొందించి యాప్‌లో ఎంట్రీ చేయాలని శిక్షణ కార్యక్రమంలో వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం సుధాకర్, సీసీలు నీరుస్సీసా, కరుణ, నరసయ్య, మండల సమాఖ్య కార్యదర్శి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మహిళలు ఆర్థికంగా పురోగతిని సాధించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కస్తూరి హైమా లఖ్‌పతీ దీదీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు కట్టయ్య, మంజుల, సుజాత, శ్రీలత, పుష్పాల రజిత, ఉమా, సుధా, మంజుల, అస్మా, జ్యోతి, శ్యామ్, సురేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.